# గార్డుగోపాలం

యర్రంశెట్టి సాయి



గార్డు గోపాలం హడావుడి పడిపోతున్నాడు. సరిగ్గా మరో అర గంట టయిముంది తను వెళ్ళాల్సిన ఎక్స్‌ప్రెస్ బండీ బయల్దేరడానికి. కాని......ఇంకా......సుగుణవంట అవనేలేదు.

ఛీ! ఈ ఆడాళ్ళు ఇంతే! అనుకొన్నాడు గోపాలం. రెండు నిమషాలాగి మళ్ళీ ఇలా అనుకొన్నాడు. "తనో ముఖ్యమయిన ఎక్స్‌ప్రెస్ బండీకి గార్డు అనీ, తన కాలస్యమయితే, ఆ రైలుబండికి కూడా ఆలస్యమవుతుందనీ తెలీదూ?.....అందు మూలాన అందులోని బోలెడు మంది ప్రయాణికులకి అవస్థ అని, పైగా తనకి మాట గూడా వస్తుందని గ్రహించుకోదేం?...... అదీగాక ఈవారం 'పంక్చువాలిటీ వీక్' ఒహటి ఏడిచిందాయె! ఆఫీసర్ల కళ్ళన్నీ ఈవారమంతా తమ బళ్ళ టైములమీదే ఘాటు నిఘా వేసి చూస్తూంటాయి. కాస్త లేటుగాపోతే చాలు......ఆఫీసుకి బుక్‌చేసి దగ్గరనుంచో బెట్టుకొని మరీ తిడతారు......ఇన్ని గొడవల్లో తను మునక్కా తేలకా చస్తూంటే.... వంట ఇంతవరకూ హయి చావదాయె......

"ఏయ్ పిల్లా!.....రైల్వే బుద్ధులు బాగా అబ్బినయ్ నీకూ!.....ఎప్పుడూ లేటే! ఖర్మకొద్దీ దొరికావ్....వంటయిందా లేదా?....." అరచాడు గోపాలం.

"ఆ నర్సునే చేసుకొంటే బావుండేది మీకు......" తిరుగమూత పెడుతూ ఉండగా జవాబులాంటి......విసురు.

ఉక్కిరిబిక్కిరయ్యాడు గోపాలం. తాలింపు ఘాటుగావుంది. ఆ విసురు అంతకంటేనూ. ఒక్కసారిగా తన ఆఫీసరులాగా కోపం వచ్చింది గోపాలానికి.

"సుగుణట!..... సుగుణ!..... వాళ్ళ నాన్న ఆ పేరు బుద్ధిలేక పెట్టాడు. లేకపోతే ఇంత ఈర్ష్య ఏమిటి?.... నిజమే నయ్యా! సుగుణ చూస్తుండగా తనోనర్సుతో నడి బజారులో మాట్లాడాడు. ఇంతకూ పాపం ఆ నర్సుమాత్ర మేం మాట్లాడిందీ? రిజర్వేషన్ గురించి హెల్ప్ చెయ్యమంది. వెంటనే సుగుణ తనని అడిగేసింది.

"ఆమె మీకు ఎలా తెలుసు? ఏమిటె అడుగుతోంది మిమ్మల్ని?" అని.

తను సరదాకి "నాకామె చాలా ఫ్రెండ్! అంచేత లక్షమాటలు మాట్లాడాల్సివుంటుంది!" అని జవాబు చెప్పాడు. అంతే! సుగుణ మొఖం ఈస్ట్‌మన్ కలర్‌లోకి మారింది. ఆరోజునుంచి సుగుణ నోటివెంబడి ఆ నర్సు

గురించి ఏదో జోకో విసురుతూ తనూ వింటూనే ఉంటాడు.

తను కొన్నాళ్ళ చచ్చే జ్వరం వచ్చి హాస్పిటల్లో చేరినప్పుడు, ఆ నర్సు పాపం ఎంతో సహాయం చేసిందనీ. అప్పట్నుంచీ ఆమె తనకు తెలుసనీ, చెప్పాంటే సుగుణ వినిపించుకోకుండా చెవులు మూసేసుకుంది.

'ఇప్పుడు నేనే మన్నాననీ.. మిమ్మల్నీ...' అంటూ మరో హా.. విసురులాంటిది అంది సుగుణ

'నీ పాడు సలహాకి సంతోషించాం కాని. వంట అవుతుందా లేదా?'

'మహారాజులా అవుతుంది.' వంటింటోంచే జవాబు.

"మరి మహారాజు ఆలస్యంగా నిద్ర లేస్తాడు." వాకిట్లోంచి

"కాని పెందలాడే నిద్రపోతాడు" వంటిల్లు..

"చచ్చు జోకు!" బూటు నేలకేసి మెల్ల మెల్లగా కొట్టాడు గోపాలం.

"ఇదో! నేను మీ నాన్నలా ఆర్. టి. సి డ్రయివర్ని కాదు తెలుసా. ఇష్టం వచ్చి నప్పుడు బయల్దేరడానికీ.. ఇష్టం వచ్చిన చోట ఆపడానికీ.. కొన్ని వందల మందిని తీసుకుపోయే రైలుబండే."

"అవును. రైళ్ళు సరిగ్గా పోతవో బస్సులు సరిగ్గా పోతవో అందరికీ తెలుసు మీరేం చెప్పక్కర్లేదు." టిఫిన్ కారియర్‌తో బయటకి వచ్చిందామె.

కారియర్ అందుకొని ఆ చేత్తోనే ఆమెను దగ్గరకు లాక్కొని, బుగ్గల మీద చిటిక వేసి "సిల్లీ గర్ల్" అనేసి బయటకు పరిగెత్తాడు గోపాలం.

"మళ్లీ ఎన్నిరోజులకి దర్శనం" అన్న ఆమె కేక అతనికి వినిపించ.. 'ఊహూ! కాదు. అతను వినిపించుకోలేదు

పది నిమిషాల్లోపలే స్టేషన్ చేరుకొన్నాడు గోపాలం. వెంటనే తన 'బ్రేక్' లోకి వెళ్లి అంతా చెక్ చేసుకొని ఇంజను వేపు బయల్దేరాడు. మరో ఇరవై నిమిషాలు టయిముంది ఇంకా.. డ్రయివరు రామస్వామి ఎ. ఎస్. ఎమ్. దాసు ఏమిటో జోకు వినినట్లుంది నవ్వేస్తున్నారు..

"గుడ్ మార్నింగ్ గోపాలం గారూ!" అన్నాడు దాసు.

తిరిగి విష్ చేశాడు గోపాలం ఇద్దరికీ. "రామస్వామీ.. కొంప ముంచెయ్యవు కదా.. పంక్చువాలిటీ వీక్.. నవ్వాడు గోపాలం.

"నీలాంటి గార్డుంటే కొంపేగాదు. బండే మునిగిపోతుంది దాసు గారూ! గార్డ్ మీద ఓ జోకు వింటారా?.." అడిగాడు రామస్వామి.

"చెప్పు గురో! జోకంటే చచ్చేంత ఇష్టం. ఆఫీసుని అడగ్గానే లీవు దొరికినంత సంతోషం."

"గోపాలంలాటి గార్డు ఒకాయన వున్నాడు. ఆయనకీ రైట్ టైమ్ మొదలగు పదాలంటే ఏడీ చావదు. రైట్ టైమ్‌కి పోవడమంటే తెలుగు పిక్చరోదాన్ని చివ్వరకంటా చూసినంత చిరాకాయనకి. అంచేత శాయశక్తులా పాటుపడి, మిగతా వాళ్లచే పడించి ఎలాగోలా మొత్తానికి లేటుగా.. అదీ ఓ గంట తక్కువ లేకుండా.. తీసుకుపోతూండేవాడు. ఆయనంటే ఆ లైను పాసింజర్లందరికీ పెద్దగురి. ఆయన్ని చూడగానే 'ఈ బండి రయిట్టయిముకు పోతుందా, ఆలీశెంగా పోతుందా అనే సంశయం రక్కున ఎగిరిపోతుంది. అలాంటి గార్డు గారు ఓ రోజున పాసింజరు బండినోదానిని కొన్ని స్టేషన్లలో, రయిట్టయిమూ, చాలా స్టేషన్లలో 'బిఫోర్ టయిమూ' తీసుకు పోతున్నాడని తెలిసిపోయి ప్రతిస్టేషనులో జనం తండోప తండాలుగా వచ్చి చూడసాగారు.

చాలాకాలానికి ఓ రైలుబండీ, అదీ లేటుగా పోవడం బాగా మరిగిన బండీ, ఓ నిమిషం కూడా లేటు లేకుండా పోతోందంటే ప్రజలందరికీ ఆనందం కదు మరీ! ఇహను, ఆ బండి టెర్మినేషను స్టేషనులో ఘనసన్మానం ఏర్పాటు చేశారు. ప్లాటుఫారం మీదే ఓ స్టేజీ.. తోరణాలు.. మంగళ వాయిద్యాలూ.. మైకూ, కాకినాడ వారి రికార్డులూ,.. ఓహ్ ఒకటేమిటి.. బండి ఆగగానే గార్డునీ, డ్రయివరునీ బయటకి లాగి, ఎ. ఎస్. ఎమ్.తో సహా ముగ్గురినీ స్టేజి మీద కూర్చోబెట్టి.. మెళ్లోపూల మాలలు నింపేశారు. ఒ తెల్లటోపీ మనిషి లేచి స్పీచ్ మొదలెట్టేశాడు.

"సోదరులారా! ఇన్నాళ్లకు మన గార్డుగారు శ్రమకోర్చి ఈ బండి రైట్ టైమ్‌కి ఇవాళ ఇక్కడకి తీసుకొచ్చారు...

"ఇది.. ఇవాల్టి.." గార్డుగారు నోరు మెదపబోయాడు.

"ఫరవా లేదన్నాడు" ఆ తెల్లటోపి, ఆయన..

"అదికాదు..ఈ బండి.."

"దట్సాల్ రైట్" అన్నాడాయన వినకుండానే.

"నన్ను మాట్లాడనీండర్రోయ్. ఇది ఇవాల్టి బండికాదు.."

"తెలుసులేవయ్యా! అందరికీ తెలుసు! అయినా మాత్రం.. గొప్ప కాదుటండీ బండి నిన్నటిదే ఔగాక..కాని ఇవాల్టి కల్లా వచ్చిందంటే.."

"అవునూ." అన్నారు జనమందరూ.

"ఇది." మళ్లీ గొణిగాడు గార్డు

అంతా నిశ్శబ్దం!

"ఇది మొన్నటిది.."

వెంకటదాసు నవ్వేస్తున్నాడు. "అబ్బ! ఏం జోకావయ్యా..నీ ఇంజను బంగారం గానూ! నీ బండి రైట్‌టైమ్ పోనూ!.."

ఆఫీసు నుంచి వచ్చే ఛార్జిషీటుల్లా గోపాలానికి ఉక్రోషం పెరిగిపోయింది.

"ఏడ్చినట్లుంది వెధవ జోకు.."అన్నాడు

"డ్రయివరు ఎవడో నీ లాంటివాడే!" అని కూడా అన్నాడు. అనేసి పరుగెత్తుకుంటూ తన బ్రేకు దగ్గరకు వెళ్లిపోయాడు. టయిమవగానే సిగ్నలు చెక్కనగింది వెంటనే విజిల్ వేసి పచ్చజెండా చూపించాడు గోపాలం కెవ్వున కూత వేసింది ఇంజను. బండి కదిలింది.

"హమ్మయ్య!" అనుకొన్నాడు గోపాలం.

మూడు స్టేషన్ల వరకూ ఆగదు బండీ.. నాలుగో స్టేషన్లో ఆగింది.

'ఓ నిమిషం ముందే వచ్చిందండోయ్. మీ బండి!" అన్నాడు ఎ. ఎస్. ఎమ్ ప్రభాకర్.

"అవును గురో! పంక్చువాలిటీ వీక్ కదా! దంచేస్తున్నాడు రామస్వామి.. అన్నట్లు. తిరుపతి పోతానన్నావ్ గదూ.. పోలేదా?"

"ఎక్కడ సార్! రెండేళ్ల నుంచీ అడుగుతున్నా ఇంతవరకూ రిలీఫ్ పంపలేదు. వెనుకటికి ఓ కొత్తగా పెళ్లయిన ఎ. ఎస్. ఎమ్ అత్తారింటికి పోడానికి, ఎంతకీ రిలీఫ్ దొరక్క విసిగిపోయి 'ఎ. ఎస్ ఎమ్ డైడ్. ఎరేంజ్ రిలీఫ్' అని టెలిగ్రాం ఇస్తే.., "లెట్ హిమ్ వైట్. నో రిలీఫ్" అని రిప్లై వచ్చిందట. అలా వున్నయి మా బతుకులు..అదిసరే. స్టార్ట్ చెయ్యండి సార్.. టైమయింది.."

మళ్లీ బండి కదిలింది.

మరో నాలుగు స్టేషన్లలో ఆగకుండానే పరుగెత్తింది బండి అయిదో స్టేషన్లో ఆగుతూనే పరుగెత్తుకు వచ్చాడు అక్కడి పార్సిల్ క్లర్కు.

"పార్సిల్ లోడింగ్ వుంది సార్."

"ఎన్ని పాకేజెస్?"

"యాభై ఫ్యూజు ఉన్నయ్యండి!"

"ఘంపావయ్యా.. ఇక్కడ.. బండి హాల్టు మూడు నిమిషాలు..ఆ బిగుసుకు పోయిన తలుపులు తెరవడానికే అయిదు నిమిషాలు పడుతుంది. ఏం చేద్దామంటావ్?"

"అరగంట అయినా సరేనండీ. లోడ్ అవ్వాల్సిందే.. నాలుగురోజుల క్రితమే పార్సిల్స్ క్విక్ డెస్పాచ్ లేదని లవ్‌లెటు రొచ్చింది ఆఫీసు నుంచి. పైగా ఇది పెరిషబుల్స్.. ఇవి బుక్ చేసిన మర్చెంటుకి ఈ ఫూరి ఎమ్. పి. గారికీ మాంచి స్నేహం. ఇవి ఏమాత్రం పాడయినా ఈ సంగతి పార్లమెంటులో పడేసి, మనిద్దరినీ సస్పెండు కేయించేస్తారు..."

అంతా పూర్తయేసరికి పదిహేను నిమిషాలు పట్టింది..

బండి కదిలేప్పటికి గోపాలం ట్రైమ్ చూసుకుంటే పద్నాలుగు నిమిషాలు లేటు వుంది బండి.

# గార్డు గోపాలం

యాభై నిమిషాలు తరువాత మరో స్టేషనులో ఆగింది బండి. రెండు నిమిషాలయిన తరువాత విజిల్ వేసి పచ్చజండా చూపబోయాడు గోపాలం.

"వన్ మినిట్ సర్. నా ఫామిలీకి ఇక్కడి నుంచీ ఫస్టుక్లాస్ రిజర్వేషన్ వుంది. కాని అందులో వేరెవరో కూర్చున్నారు. వెకేట్ చెయ్యనంటున్నాడు." ఓ పెద్ద మనిషి,

"అదిగో అక్కడ టి. టి. ఇ. వున్నాడండి వస్తారూ! ఆయనకు చెప్పండి!" చిరాకేసు కొచ్చింది గోపాలానికి.


పెద్దమనిషి వెళ్ళాడు. టి. టి. ఇ. ఫస్టుక్లాస్ కంపార్ట్‌మెంట్‌లోని వ్యక్తితో ఓ చిన్నసైజు యుద్ధం చేశాక ఆయన అది ఖాళీ చేశాడు. ఇదంతా అయి బండి కదిలేప్పటికి మరో ఎనిమిది నిమిషాలు మేకప్ అయింది. బోలెడు స్టేషన్లు దాటిపోతున్నాయి. ట్రైము కూడా అయిదు నిమిషాలు మేకప్ అయిపోయింది. నిలవేస్తాడనుకున్న అప్పులోడు తన్ని చూడకుండానే వెళ్ళిపోయి నంత సంతోషం కలిగింది గోపాలానికి. మరో రెండు స్టేషన్లు మాత్రమే వున్నాయి తను డ్యూటీ మారిపోవడానికి

వాచ్ మీద ముల్లు ముందుకీ వెనక్కూ వూగింది.

"క్రీ.." అంటూ బ్రేకులు పట్టుకొన్నాయి. గోపాలానికి వళ్ళు మండిపోయింది. ఎవరో చైన్ లాగారు. బ్రేకు దిగి ముందుకు నడిచాడు గోపాలం. రెండో పెట్టెలోనే గొలుసు లాగారు. బాగా రద్దీగా వుంది పెట్టెలో.

"ఏమిటయింది?" అడిగాడు గోపాలం కిటికీలోంచి బయటకు చూస్తున్న ఓ బుష్‌కోటుని

"ఆ! ఇప్పుడేముంది సార్! అంతా అయిపోయింది. ఒక్కపది నిమిషాలు ముందు



చూడాల్సింది మీరు. పెద్ద వార్ జరిగింది సార్. అటు ప్రక్క అయిదుగురు పాండవులూ, ఇటు ప్రక్క ఇద్దరు కౌరవులూ, చచ్చేట్లు కొట్టుకొన్నారు. ఆవిడె వరో భయపడి గొలుసు లాగేసింది. ఇప్పుడేంలేదు లెండి సార్! అంతా సర్దేశాం."

గోపాలం తిరిగి వస్తూంటే ప్రక్క పెట్టెల్లోంచి ఓ స్టూడెంట్ వేళాకోళంగా అడిగాడు "ఏంసార్. ఏమయింది? యాక్సిడెంట్ కాదు గదా?"

"యాక్సిడెంటయితే నువ్విలా మాట్లాడటానికి మిగుల్తావా బాబూ!" కోపంగా అన్నాడు గోపాలం.

"కోపమెందుకు సార్! కొత్తేముంది కనుక! పేపర్లో రోజుకో రెండు రైళ్లు ఢుద్దెట్టుకొనే ఫోటోలు రావడం లేదేమిటి"

'ప్రస్తుతం రైల్వేలు జనాన్ని ఎక్స్‌పోర్టు చేస్తున్నయిరా. ఫామిలీ ప్లానింగ్ కన్నా ఇది బెటర్ రిజల్ట్సు ఇస్తోంది!' అన్నాడు, పెర్సనాలిటీ కుర్రాడు

కాని అవి వినేందుకు గోపాలం అక్కడ లేడు.

బండి కదిలింది..మళ్లీ.. ఆఖరుసారి..

కాని ఈ సారి రామస్వామి స్పీడు దంచలేకపోతున్నాడు.

గ్రేడియంట్ మరి..

జంక్షన్ స్టేషన్ చేరుకొనేప్పటికి బండి ఇరవై అయిదు నిమిషాలు లేటు అయింది.

ఎ. ఎస్. ఎమ్. వచ్చాడు "ఏం సార్! మీ బండి గురించి రెండు కనెక్టింగ్, ట్రైన్స్ దెబ్బతిన్నయి. అన్నట్లు మీకో కంట్రోల్ మెసేజ్ వుంది. మిమ్మల్ని ఆఫీసుకి 'బుక్' చేశారు బండి లేటు అయినందుకు."


బ్రేక్ దిగి మెల్లగా నడిచాడు గోపాలం.

'సుగుణతో అనవసరంగా పోట్లాడాను" అని రెండు మూడు సార్లనుకొన్నాడు. ●


హోటల్స్ మరియు రెస్టారెంట్లు...వైద్యశాలలు మరియు హాస్టల్స్

ధనమును మరియు కాలమును

పొదుపు చేయుటకు



CALGAS



కాల్‌గాస్ వాడండి

కాల్‌గాస్ నిలకడయైన వుష్ణమును కలిగిస్తూ మీ వంటచేయుటలోగల కాలమునుతగ్గిస్తుంది. కావలసినప్పుడు వెలిగించుటకు, ఆర్పుటకు అనుకూలముగ వుండును. ఈ విధముగ కాల్‌గాస్ మీ కాలమును, ధనమును వృధాకానీయదు.

కాల్‌గాస్ సురక్షితమైనది

కాల్‌గాస్ ఉక్కు సిలిండర్లలో లీకేజి, తప్పుగ ఉపయోగించుట మొదలైన ప్రమాదములు నివారించుటకు స్పెషల్ సేఫ్టీ పాట్స్‌తో నిరపాయముగా మీవద్దకు వస్తుంది.

హోమ్ డెలివరీ సర్వీసు లభించును

కాల్టెక్స్ తయారు

సోల్ డిస్ట్రిబ్యూటరు : ఈస్ట్ కోస్ట్‌గాస్ కంపెనీ

48/9/5 కో-ఆపరేటివ్ కాలనీ, ద్వారకానగర్, విశాఖపట్నం-4. ఫోన్ : 3516.

కన్నెమరా ఆనెక్సీ, మౌంట్ రోడ్, మద్రాసు-2. ఫోన్ : 83428

క్రిందిచోట్లలో ఏజెంట్లు గలరు.* విశాఖపట్నం * మద్రాసు * విజయవాడ * కాకినాడ * ఏలూరు * గుంటూరు * కటక్ * రాజమండ్రి * నెల్లూరు * గూడూరు (నెల్లూరు జిల్లా) * తిరుపతి * బర్హాంపూరు * పాలకొల్లు * విజయనగరం * మచిలీపట్నం * కాట్పాడి * సేలం * పాండిచ్చేరి * ఒంగోలే * దుర్గు * వరంగల్ * కాంచీపురం * భువనేశ్వర్.